రైతుల ద్రోహి కాంగ్రెస్

- రైతుబంధు, రుణమాఫీ, బోనస్ అందినట్టు వాళ్లు చెప్తే నేను రాజీనామాకు సిద్ధం
- లేదంటే పీసీసీ చీఫ్ పదవికి రాజీనామా చేస్తవా?
- మహేశ్‌కుమార్ గౌడ్‌కు మాజీ మంత్రి వేముల సవాల్
- నోటికొచ్చినట్టు మాట్లాడడం సరికాదని హితవు
- కాళోజీ కళాక్షేత్రం కేసీఆర్ గొప్పేనని స్పష్టీకరణ

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, పక్కన అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నిజామాబాద్, నవంబర్ 19, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అహంకారం నెత్తికెక్కిందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. నోటికొచ్చినట్టు మాట్లాడుతూ, అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. 11 నెలల్లో హామీలన్నీ నెరవేర్చామని పీసీసీ చీఫ్ చెప్పడంపై తీవ్రంగా ధ్వజమెత్తారు. 'నీ ఇష్టం ఉన్న ఊరు వెతుక్కో.. ఏ సెంటర్లోనైనా నిలబడి రైతుబంధు, రుణమాఫీ, బోనస్ రూ.500 పడిందా? అని రైతులను అడుగుదాం. వచ్చాయని వారు చెప్తే నేను నా పదవికి రాజీనామా చేస్తా. లేదంటే నువ్వు పీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తవా?' అంటూ సవాల్ విసిరారు. 'మేము అద్భుతమైన సెక్రటేరియట్ కడితే మీరు ఉన్న గేట్లను వాస్తు రూపంలో ఊడబీకుతున్నరు' అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలను చక్కబెట్టుకోకుండా చిలకజోస్యం చెప్తున్నాడని ఎద్దేవా చేశారు. '11 నెలల పాలనపై ఏ ఒక్కరిని అడిగినా కాంగ్రెస్ పార్టీని ఛీ.. తూ అని తిరుడుతున్నరు' అంటూ దెప్పిపొడిచారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, మాజీ జడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావుతో కలిసి వేముల మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ఢిల్లీ సంస్థ చేసిన కీలక సర్వేలో ఘోరమైన నిజాలు బయట పడ్డాయని తెలిపారు. ఈ దేశ చరిత్రలో అతి కొద్ది రోజుల్లోనే చెడ్డ పేరును, అపకీర్తిని మూట గట్టుకున్న ఏకైక ప్రభుత్వం ఇదేనంటూ విమర్శించారు. ప్రజలతో అనరాని మాటలు పడిన ఏకైక ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి నిలిచి పోతారని ఎద్దేవాచేశారు. హరీశ్‌రావు నిఖార్సయిన తెలంగాణ ఉద్యమకారుడని, రాష్ట్ర ఏర్పాటుపై కాంగ్రెస్ మాట తప్పితే గడ్డి పరకలా మంత్రి పదవిని వదులుకున్న చరిత్ర ఆయనకు ఉన్నదని గుర్తుచేశారు. 'మాటలు జాగ్రత్తగా మాట్లాడు.. ముందు నీ పార్టీలో ఏం జరుగుతున్నదో నీకు తెలుసా?' అంటూ ఫైర్ అయ్యారు. 'హెలికాప్టర్ కోసం కొట్లాడుకోవడం, మూటలు సమర్పించుకునే పనుల్లోనే మీ మంత్రులు, ఎమ్మెల్యేలు బిజీగా ఉన్నరు.. పొంగులేటి, శ్రీధర్ బాబు, భట్టి సీఎం రేసులో పోటీ పడుతూ రేవంత్‌రెడ్డికి ఎసరు పెడున్నరు' అని చురకలంటించారు.

కాంగ్రెస్ చేసిందంతా విధ్వంసమే...

వరంగల్ రైతు డిక్లరేషన్‌ను గాలికొదిలి అదే ప్రాంతంలో విజయోత్సవాలు నిర్వహించుకోవడం సిగ్గుచేటని వేముల మండిపడ్డారు. 'నీ అల్లుడి కోసం నువ్వు భూములు లాక్కుంటే.. మీ చర్యలను అడ్డుకున్నందుకు లంబాడా ప్రజలను చిత్రహింసలు పెడుతున్నరు.. మూసీ బాధితులు రోడ్డెక్కుతున్నరు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్మూధైర్యం ఉంటే చేసిన పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ నగర మేయర్ నీతూ కిరణ్ భర్త శేఖర్‌పై జరిగిన దాడిని వేముల తీవ్రంగా ఖండించారు. చంపాలనే కోరికతో నిందితుడు దాడి చేసి వీడియో రికార్డు చేసి బయట పెటాడని, ఈ ఘటన వెనుక కాంగ్రెస్ హస్తం ఉన్నదని ఆరోపించారు. నిందితుడు తాను కాంగ్రెస్‌వాదినని చెప్పుకోవడంపై ఆ పార్టీ నేతలు నోరు విప్పాలని, ఇందులో కుట్ర కోణంపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు సిర్ప రాజు, నాయకులు సుదాం రవిచంద్ర, సత్య ప్రకాశ్, మురళి, న్యాయవాది మధుసూదన్‌రావు, ఇమ్రాన్, యెండల ప్రదీప్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉంటాడా?

'రేవంత్‌రెడ్డి అసలు కాంగ్రెస్ పార్టీలో ఉంటాడా? సీఎం పదవి నుంచి తీసేయగానే పార్టీ మారుతాడని మీ వాళ్లే చెప్తున్నరు. పదేండ్లలో చేయని అభివృద్ధి 10 నెలల్లో పూర్తయిందని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పడం సిగ్గుచేటు.. ఆ మాటలు వింటుంటే కరెంట్ తీగలు పట్టుకుని చావాల్సిన పరిస్థితి.. ఒక్కపనీ చేయకున్నా గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉన్నది.. పీసీసీ పదవితో కండ్లు మూసుకు పోయాయి.. పేదల ఇండ్లను కూల్చడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టిందేమిటి?' అని వేముల నిప్పులు చెరిగారు. వరంగల్‌లో కాళోజీ కళాక్షేత్రం కేసీఆర్ గొప్పదనానికి ప్రతీక అని వివరించారు. కేసీఆర్ నిర్మించిన కట్టడానికి రేవంత్‌రెడ్డి రిబ్బన్ కట్ చేశారని చెప్పారు.

రేవంత్ ఓ పిల్ల మొక్క

- బీఆర్ఎస్ పార్టీ మహావృక్షం కింద ఎదిగిన వేల మొక్కల్లో నువ్వొకడివి
- ముందు కేసీఆర్ కాళ్లు కడుగు
- ఆ నీళ్లు నెత్తిన పోసుకో రేవంత్
- రాకేశ్‌రెడ్డి, కిశోర్‌గౌడ్ చురకలు

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): 'సోనియమ్మ కాళ్లు కడిగి నెత్తిన పోసుకోవడం కాదు.. ముందు తెలంగాణ తెచ్చిన కేసీఆర్ కాళ్లు కడిగి నెత్తిన పోసుకో రేవంత్‌రెడ్డీ' అని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి చురకలంటించారు. తెలంగాణలో బీఆర్ఎస్ మహావృక్షమని, దాని కింద ఎదిగిన పిల్ల మొక్క రేవంత్ అని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానన్న రేవంత్, చివరికి కేసీఆర్ ఆనవాళ్లనే ప్రారంభించేందుకు వరంగల్ వెళ్లారని గుర్తుచేశారు. అధికారం చేపట్టి ఏడాదైనా సందర్భంగా మొదట విజయోత్సవసభ అని, విజయాలు ఏమీ లేకపోవడంతో ఇందిర మహిళాశక్తి అని ఆఖరి నిమిషంలో సభ పేరు మార్చారని ఎద్దేవాచేశారు. కేసీఆర్‌ను తిట్టడానికి, కేటీఆర్, హరీశ్‌రావుల విమర్శలకు సమాధానాలు చెప్పేందుకే ఈ సభ పెట్టినట్టు ఉన్నదని దుయ్యబట్టారు. 'ఇది ఆడబిడ్డల రాజ్యం అంటూ బడాయి మాటలు చెప్తున్నవ్. కానీ, లగచర్లలో గిరిజన ఆడబిడ్డలపై జరుగుతున్న అఘాయిత్యాలు, హైడ్రా కూల్చివేతలతో ఆడబిడ్డల కన్నీళ్లకు ఎవరు కారణం?' అని నిలదీశారు. 'బీఆర్ఎస్ నీడలో ఎదిగిన పిల్లమొక్క రేవంత్‌రెడ్డి, మహావృక్షమైన కేసీఆర్‌ను మొలకెత్తనివ్వను అనడం హాస్యాస్పదంగా ఉన్నది' అని బీఆర్ఎస్ నేత, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్ గౌడ్ ఓ ప్రకటనలో విమర్శించారు. ప్రవర్తన ఇలాగే ఉంటే రేవంత్‌కు ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

83,64,331 ఇండ్లలో ఇంటింటి సర్వే పూర్తి

సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తేతెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులగణనలో మంగళవారం వరకు 83,64,331 ఇండ్లలో సర్వే పూర్తి అయినట్టు సీఎస్ శాంతికుమారి తెలిపారు. 6న ప్రారంభమైన ఈ సర్వే 72% పూర్తయినట్లు చెప్పారు. ములుగు జిల్లా 98.9% పూర్తి చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. 95 శాతంతో నల్లగొండ జిల్లా ద్వితీయ స్థానంలో, 93.3 శాతంతో జనగామ జిల్లా తృతీయ స్థానంలో నిలిచిందని వెల్లడించారు. 50.3 శాతంతో జీహెచ్ఎంసీ చివరిస్థానంలో నిలిచిందన్నారు. సర్వేలో 87,807 మంది సిబ్బంది, 8,788 మంది పర్యవేక్షకులు పాల్గొంటున్నారని చెప్పారు. 52,493 గ్రామీణ, 40,901 అర్బన్ బ్లాకులుగా విభజించి సమగ్ర ఇంటింటి సర్వే చేపడుతున్నామని తెలిపారు.

3న మేడ్చల్-మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిసెంబర్ 3న ప్రారంభించనున్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, కేపీ వివేకానందగౌడ్, రాజశేఖర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి తదితరులు సమీక్షించారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు నిద్ర కరువు

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోయిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. మంగళవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కొడంగల్‌లో రైతులు కాళ్లు మొక్కినా వినకుండా బెదిరించి భూములు సేకరించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

శమరిమలకు 18ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : అయ్యప్ప భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశామని మంగళవారం రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మైలాలి-కొల్లం మధ్య 8 సర్వీసులు, మచిలీపట్నం-కొల్లం మధ్య 10 సర్వీసులు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. డిసెంబర్ 6 నుంచి 25, లేదా జనవరి 1 వరకు ప్రత్యేక రైళ్లు నడుస్తాయని వెల్లడించారు.

మంత్రులతో కుమ్మకై మిల్లర్ల దోపిడీ

- కాళేశ్వరంపై మంత్రుల వ్యాఖ్యలు చూసి ప్రజలు నవ్వుకుంటుండ్రు
- గాలి లెక్కలు.. దొంగ లెక్కలతో గొప్పలు చెప్తున్న ప్రభుత్వం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫైర్

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

నేరేడుచర్ల, నవంబర్ 19: రాష్ట్రంలో కొంతమంది మంత్రులు మామూళ్లకు కక్కుర్తిపడడంతో వారితో కుమ్మకైన మిల్లర్లు రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా దోచుకుంటున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం గుడుగుంట్ల పాలెంలో మంగళవారం ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పట్టుదల, కృషితోనే నేడు రాష్ట్రంలో ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. మంత్రులు చెప్తున్న ధాన్యం లెక్కలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, వారి చెప్పేవన్నీ గాలి లెక్కలు, దొంగ లెక్కలేనని విమర్శించారు. కాళేశ్వరం నీటితో సంబంధం లేకుండానే ఇంత పంట పండిందని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకుల చిల్లరమాటలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. వ్యవసాయంపై అనుభవంలేని రేవంత్‌రెడ్డి సీఎం కావడం బాధాకరమని, మంత్రి తుమ్మలకు వ్యవసాయంపై అనుభవం ఉన్నప్పటికీ మాట్లాడలేని పరిస్థితి అని పేర్కొన్నారు. ఇప్పటికైనా మంత్రులు కేసీఆర్, కాళేశ్వరంపై బురద జల్లడం మానుకోవాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, నేరేడుచర్ల బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పీడిత పాలన

- హామీలు అమలు చేయకుండా మోసం
- మూసీ కుంభకోణంలోనే మునిగిపోవడం ఖాయం
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మండిపాటు

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ సాగిస్తున్నది.. పీడిత పాలన.. భ్రష్టు పాలన అని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా సక్రమంగా అమలుచేయక అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ జోస్యాలు మాని, ప్రజలకు మేలు చేయడంపై దృష్టి సారించాలని హితవు పలికారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం పార్టీ నేతలు బొమ్మెర రామ్మూర్తి, రఘురామ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. మూసీ కుంభకోణంలోనే కాంగ్రెస్ మునిగిపోవడం ఖాయమని చెప్పారు. ప్రజల్లో ఎవరిని కదిలించినా కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఆగ్రహం కట్టలు తెచ్చుకుంటున్నదని అన్నారు. లగచర్లలో అర్ధరాత్రి వేళ కరెంట్ తీసివేసి పోలీసుల ముసుగులో గిరిజనుల ఇండ్లలో చొరబడి మహిళలపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారని ఆరోపించారు. లంబాడ మహిళలతో ఇష్టమొచ్చినట్టు మాట్లాడి, కొట్టారని, యువకులపై కూడా దాడిచేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తన గొయ్యిని తానే తవ్వుకుంటున్నదని, ఆరు గ్యారెంటీల్లో ఎన్ని అమలు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

11 నెలల్లోనే ప్రభుత్వంపై ప్రజాగ్రహం

- ఇంతటి ప్రజావ్యతిరేకతను చూసింది కాంగ్రెస్ ప్రభుత్వమే
- 'లగచర్ల'లో గిరిజన భూములను లాక్కునేందుకు 'రేవంత్'యత్నం
- 21, 22 న జిల్లాకు హరీశ్‌రావు
- ఖమ్మంలో కార్యకర్తల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు 'తాతా'

ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

ఖమ్మం, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పాలన చేపట్టిన 11 నెలల్లోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజాగ్రహం మొదలైందని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు స్పష్టం చేశారు. జిల్లాలోని బీఆర్ఎస్ నాయకులు, ముఖ్యకార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో ఖమ్మం తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే అని వర్గాల ప్రజల నుంచి ఇంత పెద్ద స్థాయిలో వ్యతిరేకతను తెచ్చుకున్నది రేవంత్ ప్రభుత్వం మాత్రమేనని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన అల్లుడి ఫార్మా కంపెనీకి భూములను అప్పగించేందుకే లగచర్ల ప్రాంతంలో గిరిజన రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని విమర్శించారు. లగచర్ల గిరిజన రైతులకు సంఘీభావంగా 21న ఖమ్మంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు. ర్యాలీలో పాల్గొనేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఎప్పుడూ ప్రజల పక్షమే: సండ్ర, లింగాల

అధికారం ఉన్నా, లేకున్నా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని బీఆర్ఎస్ నేతలు సండ్ర వెంకటవీరయ్య, లింగాల కమల్‌రాజు, కొండబాల కోటేశ్వరరావు, ఆర్‌జేసీ కృష్ణ పేర్కొన్నారు. మధిరలో ఉప ముఖ్యమంత్రి భట్టి సతీమణి మరో షాడో మంత్రిగా పనిచేస్తున్నారని ఆరోపించారు.

నాడు ముక్కలు ..నేడు తొక్కుడు

- సీఎం రేవంత్‌రెడ్డి భాషపై సర్వత్రా విస్మయం
- అధికారిక కార్యక్రమంలో రాజకీయ విమర్శలు
- పాలనా వైఫల్యంతో బీఆర్ఎస్‌పై అసహనం

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : సుదీర్ఘకాలం తెలంగాణ సాధన కోసం ఉద్యమించి.. పదేండ్లు రాష్ట్రానికి దిశ, దశను ఖరారు చేసి దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపిన కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం విరుచుకుపడిన తీరుపై సమాజం నివ్వెరపోతున్నది. నల్లగొండలో ముక్కల భాష, వరంగల్‌లో తొక్కుడు భాష.. అంతకుముందు బజారు భాష.. సభ ఏదైనా కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును తిట్టడమే పనిగా సీఎం రేవంత్‌రెడ్డి పెట్టుకున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బుల్డోజర్లతో తొక్కిస్తామని, మూసీలో పారేస్తామని నల్లగొండలో ఇష్టారీతిగా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ వేదిక సాక్షిగా 'నిన్ను తొక్కుకుంటా వచ్చిన. నీ సీటును తొక్కుక్కుంటా వచ్చిన.. కేసీఆర్ అనే మొక్కను మళ్లీ మొలవనీయ.. కాస్కో..చూద్దాం. కుట్రలు చేస్తే ఊచలేనని.. అందర్నీ బొక్కలో వేస్తాం. ఊచలు లెక్కిస్తాం' అని సీఎం రేవంత్ ఆగ్రహంతో ఊగిపోతూ చేసిన ప్రసంగంపై తెలంగాణ సమాజం నివ్వెరపోతున్నది. మూసీని ప్రక్షాళన చేసి తీరుతానని, మూసీ అభివృద్ధికి ఎవరెవరు అడ్డుపడతారో పేర్లు ఇస్తే నల్లగొండ జిల్లా ప్రజలతో బుల్డోజర్ తొక్కించకపోతే తన పేరు మార్చుకుంటానని 9న యాదాద్రి-భువనగిరి జిల్లా వలిగొండ సభలో చేసిన వ్యాఖ్యల విమర్శలు చల్లారకముందే వరంగల్ వేదికగా మరోసారి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ విరుచుకుపడిన తీరుపై విస్మయం వ్యక్తమవుతున్నది. అధికారిక కార్యక్రమమే అయినా దాన్ని సీఎం రాజకీయ వేదికగా మార్చారని, వ్యక్తిగత దూషణల పోటీ వేదికగా మలచారని తెలంగాణ సమాజం భగ్గుమంటున్నది. అసెంబ్లీ వేదికగా విలువైన సూచనలు ఇవ్వాలని కేసీఆర్‌ను కోరిన మరుక్షణమే 'అసెంబ్లీకి ఎప్పుడొస్తవో రా.. తారీఖు పెట్టు.. కాస్కో.. నీ సంగతి చెప్తా.. నిన్ను ఫాంహౌజ్‌కే పరిమితం చేస్తా' అంటూ పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యలు చేయటంపై కాంగ్రెస్ శ్రేణులే విస్మయం చెందుతున్నాయి.

రేవంత్ వ్యాఖ్యల వెనుక...

వరంగల్‌లో సీఎం చేసిన వ్యాఖ్యల వెనుక ఆంతర్యం ఏమిటన్నది చర్చనీయాంశమైంది. 'తెలంగాణ అమ్మ సోనియా.. ఆమె కాళ్లు నేనే కాదు ఇక్కడున్నవాళ్లందరూ (స్టేజీ మీద కూర్చున్నవాళ్లను చూపుతూ) కడిగి వాటిని నెత్తిన చల్లుకుంటాం' అని పేర్కొనటం, ఆ తరువాత 'ఈ సీటుకు ఊకనే వచ్చిన్నా.. అందరినీ తొక్కుకుంటా వచ్చిన' అని మరుక్షణంలోనే 'కేసీఆర్..నీ సీటును తొక్కుక్కుంటా వచ్చిన' వ్యాఖ్యానించటం వెనుక ఆంతర్యం ఏమై ఉంటుంది అనేది ఆసక్తిగా మారింది. ఇటీవలి కాలంలో ఎన్నడూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై పల్లెత్తు మాట అనని సీఎం ఉన్నపళంగా 'రాష్ట్రం విడిచిపెట్టి పోవాలి. తట్టాబుట్టా సర్దుకొని వెళ్లిపో' అని హూంకరించటం వెనుక ఏదో మతలబు ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. రేవంత్ కాంగ్రెస్‌ను టీడీపీ కాంగ్రెస్‌గా మార్చారని, బీజేపీతో దగ్గరి సంబంధాలు పెట్టుకున్నారని కాంగ్రెస్ హైకమాండ్‌కు చేర్చారని.. దీంతో తానే అందరికన్నా కాంగ్రెస్‌కు వీరవిధేయుడని ప్రదర్శించేందుకే సీఎం ఆరాటపడ్డారని అందులో భాగమే ఆ ఆగ్రహతపన అని కాంగ్రెస్ పార్టీలో ఒక వర్గం బలంగా విశ్వసిస్తున్నది.

రైతులను ముంచిన రేవంత్‌రెడ్డి

టీఆర్‌సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి

చిక్కడపల్లి, నవంబర్ 19: రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ ప్రకటించి ఏడాది కావస్తున్నా ఇంతవరకు 40% మందికే రుణమాఫీ చేశారని, మిగతా వారిని నిండా ముంచారని తెలంగాణ రైతుకూలీ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క విమర్శించారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతుకూలీ పోరాట సమితి(టీఆర్‌సీపీఎస్) ఆధ్వర్యంలో డిసెంబర్ 9న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సదస్సు కరపత్రం ఆవిష్కరించి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ లెక్కల ప్రకారం రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ 49,500 కోట్లు అంచాన వేయగా, దాన్ని రూ.31 వేల కోట్లకు కుదించి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. మిగిలిన రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లగచర్ల ఘటనపై ప్రజాకమిటీ విచారణకు ఆదేశించాలని, ఫార్మా అనుమతులన్నీ రద్దు చేసి హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని భూములను రక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది కట్టా భగవంత్‌రెడ్డి, రైతుకూలీ పోరాట సమితి రాష్ట్ర నాయకుడు జీ వెంకటేశ్వర్ రావు, రవిచంద్ర పాల్గొన్నారు.

రేవంత్ నోట మళ్లీ అబద్ధాలు

- రూ.7 లక్షల కోట్ల అప్పని దుష్ప్రచారం
- పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు 3,85,340 కోట్లు మాత్రమే
- 11 నెలల కాలంలో రేవంత్‌రెడ్డి సర్కారు తెచ్చిన రుణం రూ.77,118 కోట్లు

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ సభలో మళ్లీ అబద్ధాలే చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లు అప్పు చేసిందని మళ్ల దుష్ప్రచారం చేశారు. పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు 3,85,340 కోట్లు మాత్రమేనని మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో లెక్కలతో సహా వివరించారు. రేవంత్ సర్కారు కేవలం 11 నెలల కాలంలోనే తెచ్చిన రుణం రూ.77,118 కోట్లు. ఈ లెక్కన ఐదేండ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్లు అప్పు చేసే అవకాశం ఉన్నది. వరంగల్ సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసింది. తెలంగాణ ప్రభుత్వానికి నెలకు రూ.18,500 కోట్ల ఆదాయం వస్తున్నది. ఇందులో రూ.6,500 కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పింఛన్లకు చెల్లిస్తున్నాం. మరో 6,500 కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పు, వడ్డీలకు చెల్లిస్తున్నాం. రూ.13,000 కోట్లు చెల్లింపులకు పోగా, మిగిలిన రూ.5,500 కోట్లతో పాలన సాగిస్తున్నాం' అని చెప్పుకొచ్చారు. రేవంత్ చెప్పినవి పచ్చి అబద్ధాలు అని వివరించడానికి అనేక ఆధారాలు ఉన్నాయి. వాటిలో ఒకటి కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం.

ఇదిగో వాస్తవాలు, సాక్ష్యాలు

డిసెంబర్ 23న రేవంత్ సర్కారు ఇచ్చిన శ్వేతపత్రంలో రాష్ట్రం ఏర్పడే నాటికి ఉన్న అప్పు 72,658 కోట్లు. అంటే.. రూ.5,16,881 కోట్ల నుంచి వారసత్వంగా వచ్చిన రూ.72,658 కోట్ల అప్పును తీసివేస్తే మిగిలేది రూ.4,44,223 కోట్లు. తెలంగాణ ఏర్పడక ముందు ఎస్పీవీల ద్వారా గత ప్రభుత్వాలు చేసిన అప్పు రూ.11,609 కోట్లు. ఈ మొత్తాన్ని కూడా రూ.4,44,223 కోట్ల నుంచి తీసివేస్తే మిగిలేది రూ.4,32,614 కోట్లు. రేవంత్ ప్రభుత్వం తీసుకున్న రూ.6,115 కోట్ల అప్పును కూడా ఈ శ్వేతపత్రంలో తెలివిగా బీఆర్ఎస్ ఖాతాలో వేశారు. అవి కూడా తీసివేస్తే మిగిలే అప్పు రూ.4,26,499 కోట్లు.

డిస్కంల అప్పులూ మనమీదనే

కేంద్ర ప్రభుత్వం ఉదయ్ స్కీం తీసుకొచ్చి డిస్కంల అప్పులను రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేయాలని చట్టం చేయడం వల్ల రూ.9 వేల కోట్ల అదనపు అప్పు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నెత్తిన పడింది. గ్రాంట్ల రూపంలో రూ.17,558 కోట్ల అప్పు, కొవిడ్ కారణంగా 2021-22లో 10,784 కోట్లు అప్పు చేయాల్సి వచ్చింది. దీంతో తెలంగాణ రాష్ట్రం అనివార్యంగా 41,159 కోట్ల అప్పు తీసుకోవాల్సిన పరిస్థితికి కేంద్రం నెట్టింది. పైన పేర్కొన్న రూ.4,26,499 కోట